# సెంటిమెంట్!



రచన: వంతెన సూర్యనారాయణరాజు

"వనజా! వస్తున్నావా లేదా!" అంటూ చిందులు తొక్కేస్తున్నాడు ఊరికి ప్రయాణం అవుతున్న రఘు.

"ఆ వస్తున్నాను వుండండి. అంత తొందరైతే ఎట్లా?"

"ఆ...నువ్వొచ్చేవరకూ ఆగితే ఆ ట్రైన్ మద్రాసుకు చక్కా పోతుంది" అన్నాడు రఘు.

వనజ వేగంగా వీధిలోకి వెళ్ళి భర్తకు ఎదురుగా వచ్చింది. రఘు చాచి లెంపకాయ కొట్టాడు. వనజకు కన్నీళ్ళు పర్యంతం అయ్యింది. లోనికెళ్ళిపోయింది బాధ దిగమింగుతూ. రఘు రిక్షావాడిని పిలిచి ఎక్కి వెళ్ళిపోయాడు. మనసులో వనజకు దిగులు ఆవహించింది. క్రమక్రమంగా పనుల్లో లీనమైపోయింది. పన్నెండు కావస్తుండగా వనజ పినతల్లి రిక్షా దిగింది. లోనికి ప్రవేశిస్తూనే ఆమె 'ఏమిటే వనజా! బొత్తిగా చిక్కిపోయావు' అంటూ ఆప్యాయంగా పలకరించింది.

పినతల్లిని లోనికి తీసుకెళ్ళి వేడివేడి కాఫీ తయారుచేసి యిచ్చింది.

"ఎప్పుడు బయలుదేరావు పిన్నీ ఇంటిదగ్గర' అంది.

రావడం నిన్నే వచ్చానమ్మాయి పట్నం. మన అవతారం బాబాయ్ కూతురికి కానుపు కష్టమైతే నిన్న హాస్పత్రిలో చేర్చాము. పాపం ఆడపిల్ల పుట్టింది.

'నిన్ననగా పట్నం వచ్చిన పిన్నీ నువ్వు యింతవరకూ మా యింటికి కాకుండా వున్నావన్నమాట' అంటూ వనజ నిష్ఠూరంగా ఇంకా ఏదో అనబోయింది.

'నువ్వు ఆ మాట అంటావని నాకు తెలుసు. ఏంచేయమంటావు చెప్పు. అవతారం బాబాయికి వెనకా ముందూ ఎవళ్ళున్నారు చెప్పు. ఎంత వేలువిడిచిన వాళ్ళమైనా మనం తప్పు' అంది.

'పిన్నీ భోజనాలు వడ్డించేస్తాను మనిద్దరికి' అంది.

'భోజనం అయ్యిందే అమ్మాయీ! మీ ఆయన ఆఫీసు కెళ్ళాడేమిటి? ఎక్కడా అలికిడి లేదు' అంది నలువైపులా చూస్తూ.

'ఆఫీసుకి కాదు పిన్నీ రెండు రోజులు నాగార్జునసాగర్ కేంపుందని వెళ్ళారు. బహుశా ఎల్లుండి వచ్చేస్తారు' అంది.

'ఏమిటే అల్లుడు రెండువేలు సంపాయిస్తున్నాడు నెలకి! చేతికి రెండుజతల బంగారు గాజులన్నా చేయించలేదేమిటి? జీతం అంతా ఏమవుతున్నట్లు? మీ అమ్మ చేయించిన నల్లపూసలతాడు. ఆ ఢిల్లీహారం తప్పితే మళ్ళీ ఏమీ నగానట్రా చేయించుకోనేలేదా?' అంది.

వనజ 'లేదు పిన్నీ! ఆయన చేయిస్తానంటే నేనే వద్దన్నాను. పైగా ఈ మధ్యే పన్నెండువేల రూపాయలు పెట్టి స్కూటర్ కొన్నారు. అదీగాక నేనెంత వద్దంటున్నా గాంధీనగర్‌లో పాతికవేల రూపాయలెట్టి ఐదువందల గజాల ఇంటిస్థలం కూడా కొన్నారు' అంది.

'ఆ...అయితే అల్లుడు సంపాదనాపరుడే! ఏమో అనుకున్నాను. చూడ్డానికి అమాయకుడులా వుంటాడు పైకి. మొత్తానికి ఘటికుడే! పిల్లా, పీచూ కలగకపోయినా పెళ్ళ

యిన నాలుగేళ్ళలో నలభై వేలు వెనకేసినట్టే' అంది జయలక్ష్మి సంబరపడిపోతూ.

వనజ పినతల్లిని కూర్చుండమని చెప్పి తనెళ్ళి భోజనం చేసి వచ్చింది. ఇద్దరూ రెండు గంటలవరకూ ఆ కబురూ, ఈ కబురూ చెప్పుకుంటూ కాలక్షేపం చేసారు.

జయలక్ష్మి వనజతో 'అమ్మాయీ ఈ మధ్య సినిమా చూసి చాన్నాళ్ళయింది. ఏదైనా మంచి సినిమావుంటే వెళ్ళి చూసొద్దాం రాకూడదమ్మా?' అంది.

'పిన్నీ! సరిగ్గా నేనూ ఆ విషయమే అడుగుదామనుకుంటున్నాను. ఇంట్లోవుండి యిప్పుడు చేసే రాచకార్యాలూ ఏమీలేవు' అంటూ గబగబా పావుగంటలో నీట్ గా టాయిలెట్ అయ్యి గదులకు తాళాలువేసి వీధి గుమ్మానికీ తాళం పెట్టి పినతల్లి జయలక్ష్మితో బాటు సిన్మాకి బయలుదేరింది.

రిక్షా హాలు దగ్గర ఆగేటప్పటికే జనం టిక్కెట్సు బుక్కింగ్ దగ్గర కిటకిట లాడుతున్నారు. రిక్షావాడికి డబ్బులిచ్చి తనే రెండు బాల్కనీ టిక్కెట్లు తీసింది. ఇద్దరూ లోనికెళ్ళారు.

* * *

వనజ సినిమా చూస్తూందేగాని ఆమె మనసంతా రఘు చుట్టూ పరిభ్రమిస్తూంది. పైగా పినతల్లి తనకి పిల్లలు లేరనే విషయం మళ్ళీ గుర్తుచేసింది. దాంతో ఆమెకు దిగులెక్కువయ్యింది. వీటికి తోడు చూస్తూన్న తెలుగు సిన్మా కూడా అటువంటిదే! కథానాయిక అందమైనదే! భర్త ఆమెను ప్రేమించి పెళ్ళిచేసుకుంటాడు. కాని ఆమెకు పిల్లలు కలగరు. సంతానంలేని కోడల్ని చూసినప్పుడల్లా ఆమె అత్తగారు నాకు వంశోద్ధారకుడు పుట్టకపోతే తన కొడుక్కి మళ్ళీపెళ్ళి చేస్తానని భయపెడుతూ వుంటుంది. వనజకు నిజంగా తన బ్రతుక్కీ ఆమె బ్రతుక్కీ పోలికలున్నాయేమోననిపించింది. కాకపోతే తనకు అత్తపోరు లాంటివేవీ లేవు.

ఆట సగంలో కళ్ళు వత్తుకుంటున్న వనజను చూసి ఆమె పినతల్లి 'వనజా! ఇది సినిమా అమ్మా! నీకేమంత వయస్సయ్యిపోయిందని. అయినా వూళ్ళో యిన్ని సినిమాలు ఆడుతుండగా ఇంతకన్నా మంచి సిన్మాలేనట్టు దీనికి తీసుకొచ్చావు' అంది.

ఆరోగ్య సౌభాగ్యములకు మహిళలు ఆధారపడునవి

ఆరోగ్య అనారోగ్య పరిస్థితులలో

**లోధ్ర**

గర్భపోషణకు సుఖ ప్రసవమునకు

**గర్భరక్షక**

వేవిళ్ళకు, మలబద్ధకమునకు

**మాదీఫలరసాయనం**

ప్రసవానంతరం బలమునకు క్షీరవృద్ధికి

**సౌభాగ్యశొంఠి**

**కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్**

మద్రాసు-600 014.

ఏజెంట్లు :

**సీతారామ జనరల్ స్టోర్సు (ఏజెన్సీస్)**

విజయవాడ - సికిందరాబాద్.

'నాకు తెలీదు పిన్నీ ఈ సినిమా ఇలా వుంటుందని' అంది.

'వెళ్ళిపోదామా?' అంది జయలక్ష్మి.

'వద్దులే! మరో అరగంట ఓపికపడితే ఆట అయిపోతుంది' అంది.

సినీమా పూర్తి కాగానే ఇద్దరూ లేచి హాలు బైటకు వస్తూండగా వనజ పినతల్లితో 'పిన్నీ! నాకు కళ్ళు తిరుగుతున్నాయి. వాంతయ్యేలావుంది' అంది.

'అయ్యో! చిట్టితల్లీ! అంత నీరసంగా వుందని ముందే చెప్పలేకపోయావా! అనవసరంగా నిన్ను నేనే తీసుకొచ్చాను' అంటూ రిక్షాను పిలిచింది. వనజ తమ ఫేమిలీ డాక్టరు పేరు చెప్పి హాస్పత్రికి పొమ్మని చెప్పింది. పది నిమిషాల్లో రిక్షా హాస్పత్రిముందు ఆగింది. వనజకు నీరసంగావున్నా పినతల్లి వుండబట్టి కొంత హాపీఫీలై 'పిన్నీ! సమయానికి నువ్వు దగ్గరుండబట్టి సరిపోయింది. ఆయన వెళ్ళినప్పటి నుండీ శరీరంలో ఎంతో నిస్సత్తువ ఆవహించింది' అంది.

రిక్షావాడు 'వచ్చేదాకా వుండమంటారా అమ్మా!' అన్నాడు.

'అక్కర్లేదు' అని వాడికి కిరాయిచ్చి వెయిటింగ్ రూములోకివెళ్ళి బెంచీమీద చతికిలబడింది. కొంతసేపటికి వనజని రమ్మని పిలుపు వచ్చింది.

* * *

లేడీ డాక్టర్ కళ్ళు పరీక్షచేసి లోనికి నడిపించుకుని వెళ్ళి ప్రాథమికమైన టేస్టులన్నీ చేశాక 'మీకు పులుపైన కాయలు అవీ తినాలని అనిపిస్తూందా! ఇంకా ఏమైనా కోరికలు కలుగుతూ వుంటాయా' అంటూ ఏవేవో ప్రశ్నలు వేసింది. వనజకు డాక్టర్ ధోరణి చిత్రంగా అనిపించినా అడిగిన ప్రశ్నలన్నిటికీ ఔనని తలాడించింది.

డాక్టర్ తేలిగ్గా నవ్వేస్తూ 'రఘు తండ్రి కాబోతున్నారు' అంది.

వనజ. తన శ్రవణేంద్రియాలను తాను నమ్మలేకపోయింది. ఆమె మనస్సు పురివిప్పిన నెమలిలా నాట్యం చేసింది. ఆత్మ సాక్షాత్కరించి 'నువ్వు గొడ్రాలివి కాదు. నువ్వు గొడ్రాలివి కాదు' అంటూ పలుసార్లు హెచ్చరించింది.

డాక్టర్ ఆజ్ఞమేరకు నర్స్ వెళ్ళి వెయిటింగ్ రూములో కూర్చున్న వారి నుద్దేశించి 'వనజగారు తాలూకు ఎవరన్నా వుంటే డాక్టర్ పిలుస్తున్నారు' అంది పెద్దగా.

జయలక్ష్మి ఆతృతగా ఆమెను అనుసరించి లోనికెళ్ళింది. డాక్టర్ కూర్చీకి ఎదురుగావున్న కుర్చీలో వనజ




మేము అతి నూతనమైన యంత్రసాధనములను అమర్చి అతి సరసమగు, అత్యాకర్షణీయమగు, నేత్రానందకరమైన జంకాళాలు మరియు బెడ్‌షీట్లను తయారించుచున్నాము. మహాశయులు మాకు చేయూతనిచ్చి అత్యధికముగా ఆర్డరు ఇవ్వవలెనని కోరుచున్నాము. మీ ఆర్డరును వెంటనే గమనికచి సప్లయి చేయుదుము.

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)

**Sivakumar Industrials**

BHAVANI - 638 301;

P. B. No. 38 Phone No 265

కూర్చుని వుంది. జయలక్ష్మిని కళ్ళతో ఆనందంగా ఆహ్వానించింది వనజ. డాక్టర్ ఆమెను కూర్చుండమని చెప్పి, 'ఈమె నీకేమవుతారు?' అంది.

'మా అక్కయ్య కూతురండి' అంది జయలక్ష్మి తడుముకోకుండా.

'ఐసీ! అలాగా! మీరు త్వరలో అమ్మమ్మ కాబోతున్నారు' అంది డాక్టర్.

జయలక్ష్మి ఉబ్బి తబ్బిబ్బయిపోతూ 'నిజంగానా డాక్టరమ్మా! ఎంత చల్లనివిషయం చెప్పావు! మా అక్కయ్య బ్రతికివుంటే ఎంత పొంగిపోయేదో' అంది.

లేడీడాక్టర్ వ్రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ తీసుకుని ఇద్దరూ రిక్షా ఎక్కి ఇంటిముఖం పట్టారు. సరిగా యింటిముందు రిక్షా ఆగేటప్పటికి రఘు వాకిట్లో సిగరెట్ కాలుస్తూ నిలబడ్డాడు. వనజ రిక్షా దిగుతూనే ఖంగారుపడుతూ 'ఎంతసేపయ్యిందండీ మీ రొచ్చి' అంది.

'పది నిమిషాలయ్యింటుంది. మీ పిన్నిగా రెప్పుడొచ్చారేమిటి?' అన్నాడు సిగరెట్ విసిరిపారేస్తూ.

"మీరలా వెళ్ళారు తానిలావచ్చింది' అంది.

తలుపుతీసి భర్త బెడ్డింగు లోపలపెట్టి గేస్‌స్టౌవ్ వెలిగించి టీ పెడుతూంటే జయలక్ష్మి అక్కడకు వచ్చి, 'వనజా! నువ్వు మంచంమీద పడుకో! అసలే నీరసంగా వున్నావు' అని ఆమెను బెడ్‌రూములోకి పంపేసింది. తనే టీ తీసికెళ్ళి అల్లుడి కిచ్చింది. బట్టలు మార్చుకుని లుంగీతో ఎదురైన రఘు పిన్నత్తగార్ని చూసి బిడియపడుతూ, 'ఏమిటత్తయ్యా! టీ మీరు తీసుకొచ్చారు. వనజ ఏంచేస్తోంది లోపల' అన్నాడు.

జయలక్ష్మి ఖాళీ కప్పు తీసుకొని వెళ్ళబోతూ 'బాబూ రఘూ! నువ్వు తండ్రివి కాబోతున్నావు' అని చెప్పి చక్కా వెళ్ళిపోయింది. రఘుకు ఒక్కసారి ఎగిరి చిన్నపిల్లవాడిలా గెంతాలనిపించింది. ఆతృతగా బెడ్‌రూములోకి వెళ్ళాడు వనజ ఏం చెబుతుందో వినాలని. వనజను చూడగానే రఘుకి ఆమె ఎంతగా కనిపించింది. వెళ్ళడమే తడవుగా ఆమెను మాట్లాడనీయకుండా ముద్దులతో ముంచెత్తేసాడు.

భర్త ఆగడాలు హద్దులు మీరతాయేమోనని వనజ ఒక్కసారి ''పిన్ని వస్తూందండి" అంది.




## 'ఎస్' బీడీల ఎగుమతి




కెనడా, స్విట్జర్‌లాండ్, ఆస్ట్రేలియా, అమెరికా మున్నగు అనేక దేశాలకు మెస్సర్స్ ఎ హబీబిర్ రహమాన్ అండ్ సన్సు, గుడియాత్తంవారు ఉత్పత్తిచేయు 'ఎస్' బీడీలు ఎగుమతి అవుతున్నాయి. అంతేకాదు. అనేక ఇంటర్నేషనల్ పైర్సులో వీటిని ప్రదర్శనమునకు పెట్టారు. జర్మనీ (లిప్‌జిగ్ పైర్) స్వీడన్, బెల్జియం, సింగపూరు మున్నగు దేశాలలోనే కాక, అనేక ఆఫ్రికన్ దేశాలలోని ప్రదర్శనాలలో కూడా వీటిని ప్రవేశపెట్టారు. 'ఎస్' బీడీలకు వారు తయారుచేసిన 20 శాల్తీలు గల సిగరెట్ పెట్టె వంటి పాకెట్లో కొత్త రూపు, అందచందాలు కూడా ఏర్పడ్డాయి.

ఆద్యంతన భవిష్యత్తులో అమెరికా, యూరోపు ఖండాలలో నాగరిక ప్రజలలో సైతం అభిమానులను పెంచుకొని 'ఎస్' బీడి సుస్థిరమైన స్థానం ఆక్రమించగలదను నమ్మిక ఏర్పడ్డది. ప్రాచ్య పాశ్చాత్య దేశాలలో లభించిన విశేష ప్రోత్సాహం దానిని దృఢపరుస్తున్నది.

రఘు తప్పుచేసిన వాడిలా ఆమెకు దూరంగా నిలుచున్నాడు. నలువైపులా చూసాడు. జయలక్ష్మి అక్కడకు రానేలేదు.

"అమ్మదొంగా! అబద్ధాలాడుతున్నావు! ఆడపిల్ల పుడుతుంది సుమా!" అన్నాడు రఘు.

"ఏ పిల్లయినా ఫరవాలేదులెండి. అసలు పిల్లలులేని గొడ్రాలనిపించుకునే కంటే..." అంటూండగానే ఆమె గొంతు బాధతో పూడుకుపోయింది.

ఛ! ఛ! ఏమిటీ కన్నీరు, తమాషాకన్నా నీతో తంటాలాగుందే!" అంటూ ఆమెను తన అక్కున జేర్చుకుని పసిపిల్లను ఓదార్చిన రీతిగా ఓదార్చాడు.

వనజ యథాలాపనగా ఇదివరలోలానే ''మరి నాకీసారి ఏం తీసుకొచ్చారు కేంపునుండి'' అంటూ అడిగింది.

నువ్వు ఎదురు వచ్చిన ప్రతిసారి వెళ్ళిన పని పూర్తి కావడం పట్టుబీరో, మరో ప్రెజంటేషనో తేవడం జరుగుతోంది. కాని ఈసారి అసలు ఆఫీసుకెళ్ళాక కేంపు క్యాన్సిలయ్యింది" అన్నాడు. మళ్ళీ ఏదో గుర్తుకొచ్చినట్టు ఫీలయ్యి, నీకు చురుక్కుమందా ప్రొద్దున్న నే కొట్టిన దెబ్బతో" అన్నాడు.

"ఆ...చుర్రుమనడమేం ఖర్మ! కళ్ళంట నీళ్ళు గిర్రున తిరిగితేను" అంటూ బుంగమూతిపెట్టి అపరసత్యభామలా ఫోజుపెట్టింది.

''చూశావా నీకు నా చేతిదెబ్బ చర్రున తగిలిందంటే నా పని దిగ్విజయంగా జరిగిందన్నమాట. నువ్వు నేను కేంపుకెళ్ళే ప్రతిసారి ఎదురు రావడం క్షేమంగా వెళ్ళి లాభంగా రమ్మనడం, నీ మాటమేరకు నా సెంటిమెంటు అని అన్నీలాభాలు జరగడం చాలా జోక్‌గాలేదు. ఇప్పుడు మాత్రం లాభం రాలేదేంటి చెప్పమ్మా" అన్నాడు అర్థోక్తిగా ఆమె కళ్ళలోకి చూస్తూ.

"ఏమిటో మీరే చెప్పండి'' అంది వనజ.

"నువ్వు తల్లివి కాబోతున్నావు. ఇంతకన్నా మన జీవితానికి మరో లాభమేముంది" అన్నాడు.

వనజ ఔనన్నట్లు తలవూపిందేగాని ఏ సమాధానం చెప్పలేదు. జయలక్ష్మి అక్కడికి వస్తూ "కద్దరూ బాత్రూంలో కెళ్ళి కాళ్ళు చేతులు తడుక్కురండి భోజనం వడ్డిస్తాను" అని చెప్పపోయింది. అప్పటికికాని సమయం తీరలేదు వాళ్ళకు. రఘు బలవంతం చేస్తే జయలక్ష్మి కూడా టేబుల్‌ముందు పంక్తి కూర్చుంది. భోజనాలయ్యాక వక్కపొడి నములుతూ సిగరెట్ వెలిగించి రఘు భార్య దగ్గర కొచ్చాడు. వనజ బెడ్‌రూములోవున్న చిట్టిపాపాయి కేలండర్‌ని తదేకంగా చూస్తూ వుండిపోయింది.

సిగరెట్ యాష్‌ట్రేలో కుక్కి భార్య దగ్గరకు వచ్చి ఆమె భుజంమీద చెయ్యివేస్తూ, "వనజా కడుపుతో వున్న వాళ్ళకు ఏవో కోరికలున్నాయంటారు కదా! మరి నీకు అటువంటి కోరికలు ఏమన్నా వున్నాయా?" అన్నాడు.

వనజ తడుముకోకుండా "ఒకే ఒక కోరికుంది తీరుస్తానంటే?" అంది.

"ఒకటికాదు వంద అడుగు తీరుస్తాను" అని భరోసా ఇచ్చాడు.

"మాట తప్పరు కదా!"

"నీమీద ఒట్టు" అన్నాడు.

"మీరు కేంపు కెళ్ళినప్పుడల్లా మీ పని విజయవంతం కావడంకోసం ప్రతిసారి నా చెంప చెళ్ళుమనిపించడం సెంటిమెంటుకు ఫుల్‌స్టాప్ పెట్టాలి" అంది గోముగా.

"ఓసి యిదా నీ కోరిక! ఈ భూమ్యాకాశాలు సాక్షిగా నీ మెళ్ళో కట్టిన తాళి సాక్షిగా నా సెంటిమెంటు పేరుతో నీ లెంపలు యిక వాయించను. అయినా నీవు తల్లి అవుతున్న శుభసందర్భంలో మన వంశాంకురానికి కూడా ఆ ఎఫెక్టు తగులుతుంది కాబట్టి నేను నిన్ను మాటలతో కూడా హింసించనని సవినయంగా మనవిచేసుకుంటున్నాను" అన్నాడు.

వనజ పైటకొంగు అడ్డుపెట్టుకుని మరీ నవ్వింది.

